క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ వారికి మాఘమాసం కృష్ణపక్షం అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నిత్య అర్చనతో ప్రారంభించి కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు విశేషంగా హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ఆనందపురం సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ రమేష్

తగరపువలస: ఆనందపురం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా కశిరెడ్డి బాలాజీ రమేష్ నియమితులయ్యారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన నక్కా ఆనంద్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. గతంలో బదిలీల సందర్భంగా ఒకసారి బాలాజీ ఆనందపురంలో సబ్ రిజిస్ట్రార్‌గా జాయిన్ అయ్యారు. నక్కా ఆనందకుమార్ న్యాయస్థానానికి వెళ్లి తిరిగి కొనసాగడంతో బాలాజీ వెనక్కు వెళ్లారు.

కొట్లాటలో నిందితుడికి రిమాండ్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు కాపులుప్పాడలో గురువారం జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలివి.. కాపులుప్పాడలో ఓ కాంక్రీట్ గోడ వివాదంలో వేముల రాంబాబు (50), మాజీ సైనిక ఉద్యోగి జి.అప్పలకొండ అలియాస్ కల్యాణ్ (35) మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాంబాబును కల్యాణ్ బలంగా గాయపరచడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రస్తుతం రాంబాబు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. రాంబాబు కుటుంబ సభ్యులు భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. శుక్రవారం కల్యాణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

యూనియన్ బ్రాంచ్‌లో ఆకస్మిక తనిఖీ

తగరపువలస: ఆనందపురం యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో శుక్రవారం బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.వి.ఎల్.ఎస్.రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. మహిళలు, ఖాతాదారులతో మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. బ్రాంచ్‌లో బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రుణం తీసుకున్నవారు రెన్యువల్‌కు వచ్చినప్పుడు మొత్తం డబ్బులు చెల్లించిన తరువాతే రెన్యువల్ చేస్తామని సిబ్బంది అంటున్నట్టు ఖాతాదారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మేనేజర్ రాజు నాయక్, అసిస్టెంట్ మేనేజర్ సృజన, జి.శ్రీనివాస్, సింహాచలం నాయుడు ఉన్నారు.

జీవీఎంసీకి అరకోటి ఆదాయం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2కి అర కోటి ఆదాయం సమకూరింది. 8వ వార్డు ఎండాడలోని ఎంకే బిల్డర్స్ యాజమాన్యం శుక్రవారం వీఎల్‌టీ కింద అరకోటి చెల్లించింది. ఈ మొత్తాన్ని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి సమక్షంలో ఆర్వో రామనారాయణ, అడ్మిన్ రాజు తదితరులు ప్రధాన కార్యాలయంలో డీసీఆర్ సత్య శ్రీనివాసరావుకు అందజేశారు.

చికిత్స పొందుతూ బళ్లారి మహిళ మృతి


మృతురాలు లక్ష్మీదేవి

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం జాతీయరహదారిపై ఫిబ్రవరి 23న ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన సంఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి(65) అనే మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని దేవీనగర్, కురుబుర హాస్టల్ ప్రాంతానికి చెందిన 35 మంది యాత్రికులు బస్సులో ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు వెళ్తుండగా డ్రైవర్ వీరయ్య నిర్లక్ష్యం కారణంగా లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు యాత్రికులు గాయపడ్డారు. కాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి అప్పటి నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మృతురాలి భర్త నారాయణ ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలతోనే ప్రగతి

- మానవాళి మనుగడకు సైన్స్ తప్పనిసరి
- సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖరరావు
- ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు


నమూనాలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు, ఇతర ఉపాధ్యాయులు

మధురవాడ: పరిశోధనలతో ప్రగతి సాధ్యమవుతుందని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. సైన్స్ లేని మానవాళి మనుగడ లేదన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్, ఇతర అంశాలకు సంబంధించిన అంశాలపై రూపొందించిన 150 నమూనాలను పరిశీలించి, వారిని అభినందించారు. ఎస్ఎస్ఏ సీఎంవో దేవుడు బాబు, పి.రాజారావు, హెచ్ఎం జి.రవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అచ్యుతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- మధురవాడ రవీంద్రభారతిలో సైంటియా పేరుతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో (2024–25) ఆకట్టుకుంది. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీఎన్‌డీ నాగేశ్వరరావు, కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు డాక్టర్ సుభాష్ చంద్ర పట్నాయక్, విద్యా సంస్థల చైర్మన్ ఎంఎస్ మణి తదితరులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

తగరపువలస: రాయపాలెం హైస్కూల్లో సైన్స్ డేను ఎంపీడీవో హనుమంతరావు ప్రారంభించారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎన్.రమేష్ సైన్స్ డే నిర్వహించారు.
- తాటితూరు ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం కె.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు రామన్‌కు నివాళులు అర్పించారు.
- చిట్టివలస రామకృష్ణ విద్యాలయంలో సైన్స్ డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన వందలాది నమూనాలను తల్లిదండ్రులు సందర్శించారు. స్కూల్ కరస్పాండెంట్ మానాపురం శివసాయి, శ్రీనివాసరావు, ప్రేమ్ స్వరూప్ రెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక శ్రీబాసర లీడ్ స్కూల్‌లో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు.
- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి రామన్ ఎఫెక్ట్ వలన ప్రయోజనాల గురించి విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులు శాస్త్రీయ పరిశోధనలపై ఆసక్తి పెంచుకుని సొంత ఆలోచనలు జోడించాలన్నారు. ఈ సందర్భంగా సిద్ధాంత ఆధార సైన్స్ నమూనాలు ప్రదర్శించారు.
- చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి, నగదు బహుమతులు అందించారు. హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయుడు రేఖ అప్పారావు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో..

భీమునిపట్నం: నమూనాల రూపకల్పనలో విద్యార్థులకు కొత్త ఆలోచనలు వస్తాయని, అవి వారి చదువుకు ఎంతగానో ఉపయోగపడతాయని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖరరావు అన్నారు. భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. ఆయన కూడా వారికి కొన్ని ప్రయోగాలను చేసి చూపారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో..

కొమ్మాది: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని గీతం ప్రొఫెసర్ కేవీఎస్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల వైజ్ఞానిక నమూనాలను పరిశీలించి అభినందించారు. ప్రిన్సిపాల్ డా. వైఎస్ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భీమిలి కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు ప్రయోగాలు చేసి చూపుతున్న ఏపీసీ


రవీంద్రభారతిలో జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు


చిట్టివలస రామకృష్ణ విద్యాలయంలో ప్రదర్శనలు తిలకిస్తున్న తల్లిదండ్రులు


రాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు


చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ నమూనాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి


సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ప్రొఫెసర్ సురేష్ రెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే జేబుకు చిల్లే

నేటి నుంచి మారనున్న ట్రాఫిక్ నిబంధనలు

పీఎంపాలెం: రోడ్డు భద్రతా నిబంధనలు మారాయి. శనివారం నుంచి డ్రైవింగ్ చేసేటప్పుడు చాలా రకాల ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. కొత్త రవాణా నియమాలు పాటించకపోతే జేబులు చిల్లు పడడం ఖాయం. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.సాయి శనివారం నుంచి అమల్లోకి రానున్న ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.

జరిమానాలు ఇలా	నాడు	నేడు
లైసెన్సు లేని వ్యక్తికి వాహనం ఇస్తే :	రూ.1000	రూ.5000
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే :	500	రూ.5000
మైనర్ వాహనం నడిపితే :	రూ.500	రూ.10,000
అతి వేగంగా నడిపితే :	రూ.400–500	రూ.1000–2000
ప్రమాదకరంగా నడిపితే :	రూ.1000	రూ.10,000
రిజిస్ట్రేషన్ లేని ఫిట్‌నెస్ లేని వాహనాలకు:	రూ.2000–4000	రూ.5 వేలు–8 వేలు
రేసింగ్‌లకు పాల్పడితే :	రూ.1000-5000	రూ.10,000
సీటు బెల్టు ,హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే :	రూ.100	రూ.1000

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబూరావు మృతి


అల్లు బాబూరావు (ఫైల్)

తగరపువలస: ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు బాబూరావు (79) వృద్ధాప్య సమస్యలతో చికిత్స పొందుతూ సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందారు. చిట్టివలస జ్యూట్ మిల్లు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ నగర కార్యవర్గ సభ్యునిగా ఈయన కార్మికుల పక్షాన పని చేశారు. వృద్ధాప్యంలోనూ పార్టీ కార్యక్రమాలలో పాల్గొని పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. వారం రోజుల క్రితం జేసీఎల్ కార్యాలయంలో మిల్లు యాజమాన్యంతో జరిగిన చర్చలలో కార్మికుల తరపున బాబూరావు పాల్గొన్నారు. ఈయన భౌతిక కాయానికి చిట్టివలస గోస్తనీనది తీరాన శ్మశానవాటికలో శనివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన భౌతిక కాయానికి నివాళులు అర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, చిట్టివలస లేబర్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, ఇంటక్, కాంగ్రెస్ కార్మిక సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్లు జీరు వెంకటరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, గంటా నూకరాజు తదితరులు ఉన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ వారి ఉత్సవాలు మార్చి 27 నుంచి 30వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27న తొలేళ్ల ఉత్సవం సందర్భంగా రాత్రి గంటస్తంభం వేదిక వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చుతామన్నారు. అదే రోజున పెద్ద ఎత్తున బళ్ల వేషాలు, నేలవేషాల ఊరేగింపులు జరుగుతాయని తెలిపారు. 28న అనుపు ఉత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. తరువాత రెండు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గంటా తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి ఎచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పాసి వినోద్‌కుమార్, కో–ఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కడియం–ద్వారపూడి–అనపర్తి సెక్షన్ మధ్య ఆధునికీకరణ పనుల కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 1, 2 తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం(12739) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2,3 తేదీల్లో విశాఖ -గుంటూరు (12740)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2న ఇరువైపులా విశాఖపట్నం–గుంటూరు–విశాఖ (22701/ 22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 3న లింగంపల్లి–విశాఖ(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి

డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ గరుడ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో సంధ్యాదేవిని నియమించారు.

నిరుద్యోగులను నిరాశపరిచే బడ్జెట్


బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 17.5 శాతం ఉండగా వారి నిరుద్యోగ భృతి కోసం వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఇది నిరుద్యోగులను నిరాశరిచే బడ్జెట్ అని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బడ్జెట్ కేటాయింపులపై చిల్లపేటలో మాట్లాడారు. ధరల స్థిరీకరణకు తగు కేటాయింపులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆర్ అండ్ బీ నిధుల తగ్గింపుపై విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అప్పుల సామర్థ్యం లేనప్పటికీ అదనపు పన్నులు విధించి మరిన్ని అప్పులు తెచ్చుకునేందుకు చేసే గారడీ కనిపిస్తుందన్నారు. మొత్తంమీద అంకెల గారడీతో వార్షిక బడ్జెట్‌ను మమ అనిపించార న్నారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం

భీమునిపట్నం: భీమిలిలోని నూకాంబిక టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ దినోత్సవం నిర్వహించారు. కుట్టుమిషన్‌ను కనుగొన్న విలియమ్స్ హు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

ట్రెండ్‌కు అనుగుణంగా టైలర్లు మారాలి

తగరపువలస: రెడీమేడ్ ప్రభంజనంలో టైలర్లకు ఆదరణ తగ్గుతున్నందున మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వారు వ్యాపార సరళిని మార్చుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎల్లమాంబ టైలర్స్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బీచ్‌లో మునిగిపోయిన వ్యక్తిని కాపాడిన మత్స్యకారులు


క్షతగాత్రుడు సత్యనారాయణ

తగరపువలస: భీమిలి బీచ్‌లో శుక్రవారం పవిత్ర స్నానం చేయడానికి వచ్చి ప్రమాదవశాత్తు మునిగిపోయిన సత్యనారాయణ (51) అనే వ్యక్తిని స్థానిక మత్స్యకారులు రక్షించారు. నగరంలోని దొండపర్తికి చెందిన సత్యనారాయణను సముద్ర కెరటాలు కబళించగా బయటికి తీసుకు వచ్చిన మత్స్యకారులు భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని పోలీసులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్‌ఎంకు బెయిల్

సొంత పూచీకత్తుతో బెయిల్ ఇచ్చిన సీబీఐ స్పెషల్ కోర్టు


సౌరభ్‌కుమార్ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు కూడా తీసుకున్న నేపథ్యంలో.. సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్ ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

తాటిచెట్టుపైనే తనువు చాలించాడు

గుండెపోటుతో మరణించిన గీత కార్మికుడు


మృతుడు రమణ

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గీత కార్మికుడు బాడితబోయిన రమణ(55) శుక్రవారం తాటిచెట్టుపై కల్లు గీస్తూ గుండెపోటుతో అక్కడే మృతి చెందాడు. మోకు సాయంతో చెట్టు ఎక్కిన మృతుడు అక్కడే ఉండిపోవడంతో తోటి కార్మికులు, బంధువులకు అనుమానం వచ్చి చూడగా మృతి చెందినట్టు గుర్తించారు. అనంతరం తాళ్ల సాయంతో రమణను కిందకు దించి గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో భీమిలి పోలీసులకు, ఎక్సైజ్ కార్యాలయానికి సమాచారం అందించారు. మృతునికి భార్య నరసయ్యమ్మ, కుమారులు అప్పలరాజు, సురేష్, కృష్ణ ఉన్నారు. వీరిలో మొదటి ఇద్దరికి వివాహం అయింది.

విశ్వశాంతిని కోరుతూ శోభాయాత్ర


శోభాయాత్రలో శ్రీ రాధామదన్ మోహన్ స్వామి, పాల్గొన్న భక్త జనసందోహం

పీఎం పాలెం: విశ్వశాంతిని కోరుతూ శ్రీ రాధా మదన్‌మోహన్ స్వామి శోభాయాత్ర వైభవంగా సాగింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక వైజాగ్ కన్వెన్షన్ వద్ద ప్రారంభమైన యాత్ర కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయం వరకు సాగింది. వందలాది భక్తులు యాత్రలో పాల్గొన్నారు. హరే రామ, హరే కృష్ణ నామజపంతో తన్మయులయ్యారు. మంగళవాయిద్యాలయ నడుమ పారవశ్యంతో నృత్యాలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ నగర అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస పర్యవేక్షణలో యాత్ర సాగింది. శోభా యాత్రలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు విజయ భాస్కర్, డీఈవో ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, సీనియర్ హెచ్ఎం మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.